దేశంలో ప్రాంతీయ పార్టీల శకమే

- ప్రాంతీయ పార్టీలే దేశ భవిష్యత్తుకు పునాది
- మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలే దీనికి నిదర్శనం
- కాంగ్రెస్ చేతగానితనంతోనే బీజేపీ మనుగడ
- ప్రాంతీయ పార్టీల అంతానికి రెండు పార్టీల కుట్ర
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టీకరణ
- జేఎంఎం, ఏక్‌నాథ్ షిండే, అజిత్‌పవార్‌కు అభినందనలు

2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల నుంచే దేశంలో సంకీర్ణ శకం మొదలైంది. భవిష్యత్తులోనూ ఇదే ట్రెండ్ కొనసాగటం ఖాయం. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు సొంతంగా ఏ రాష్ట్రంలో కూడా ప్రభుత్వాలు ఏర్పాటు చేసే పరిస్థితిలో లేవు. ఆ రెండు పార్టీలు కలిసి దేశంలో ప్రాంతీయ పార్టీలు ఉండొద్దని కుట్రలు చేస్తున్నాయి. అవి ఎన్ని కుట్రలు చేసినా ప్రాంతీయ పార్టీలను ఏమీ చేయలేవు. -కేటీఆర్

తెలంగాణ ప్రజలకు చెందిన రూ.300 కోట్ల సొమ్ముతో పెద్ద ఎత్తున ప్రకటనలిచ్చి తిమ్మిని బమ్మిని చేద్దామనుకున్న రేవంత్ ఆటలు మహారాష్ట్రలో సాగలేదు. తెలంగాణలో ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండానే మహారాష్ట్రలో మహిళలకు రూ.3000 ఇస్తామని నయవంచన చేసే కుట్రను అక్కడి ప్రజలు గుర్తించారు. -కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన అబద్ధాలను ఆ రాష్ట్ర ప్రజలు తిప్పి కొట్టి తగిన బుద్ధి చెప్పారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండానే అన్నిహామీలు అమలైనట్టు చేసిన దొంగ ప్రచారానికి కాంగ్రెస్ మూల్యం చెల్లించుకున్నదని విమర్శించారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ ఘోర ఓటమి నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇక్కడి ప్రజలను మోసం చేస్తున్న తీరును మహారాష్ట్ర ప్రజలు గుర్తించారని చెప్పారు. తెలంగాణలో ఏదో పొడిచేశామని రేవంత్‌రెడ్డి చేసిన అబద్ధపు ప్రచారాలను మరాఠా ప్రజలు నమ్మలేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రచారాలు, ప్రసంగాలు, బ్యాగులు, చాపర్లు అన్నీ కాంగ్రెస్‌ను ఘోర ఓటమి నుంచి కాపాడలేకపోయాయని దుయ్యబట్టారు. మహారాష్ట్రలో అదానీని గజదొంగగా అభివర్ణించి తెలంగాణలో అదే అదానీతో వ్యాపార, వాణిజ్య సంబంధాలు పెట్టుకున్న విషయాన్ని ప్రజలు గుర్తించారని చెప్పారు. ఇకనైనా ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేయాలని, తన ప్రాథమిక కర్తవ్యంపై దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు.

బీజేపీకి బలమైన ప్రతిపక్షంగా కూడా నిలవలేని దయనీయ పార్టీ కాంగ్రెస్. కేవలం ఆ పార్టీ చేతగాని, అసమర్థ విధానాల వల్లే బీజేపీ మనుగడ సాగిస్తున్నది. ప్రాంతీయ పార్టీలు బలంగా లేని చోట మాత్రమే బీజేపీ గెలుస్తున్నది. తన చేతగాని తనాన్ని, అసమర్థతను గుర్తించాల్సింది పోయి ప్రాంతీయ పార్టీలను ఎలా అంతం చేయాలన్న కుట్రపైనే కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. -కేటీఆర్

రెండు పార్టీలను తిరస్కరించారు

ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్‌ను, ప్రాంతీయ అస్తిత్వాన్ని చులకనగా చూసిన బీజేపీని ప్రజలు తిరస్కరించారని కేటీఆర్ పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల నుంచే దేశంలో సంకీర్ణ శకం మొదలైందని, భవిష్యత్తులోనూ ఇదే కొనసాగుతుందని చెప్పారు. జాతీయ పార్టీలకు అడ్డుగా నిలబడి రాష్ట్రాల అస్తిత్వం, అభివృద్ధి కోసం పోరాటం చేసే పార్టీలను వేధిస్తే ప్రజలే తిరగబడి బుద్ధి చెప్తారని జార్ఖండ్ నిరూపించిందన్నారు. హేమంత్ సోరెన్‌ను వేధించిన కేంద్రానికి ఈ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారని తెలిపారు. జార్ఖండ్‌లో ఘన విజయం సాధించిన జేఎంఎం (జార్ఖండ్ ముక్తి మోర్చా)కు, ఆ పార్టీ అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌కు కేటీఆర్ అభినందనలు తెలిపారు.

ప్రాంతీయ పార్టీల అండతోనే బీజేపీ గెలుపు

మహారాష్ట్రలోనూ బీజేపీ గెలుపులో ప్రాంతీయ పార్టీ నేతలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లే కీలకమయ్యారని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత పెరగడం దేశ సమాఖ్య స్ఫూర్తికి, రాష్ట్రాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. భవిష్యత్తులోనూ కేసీఆర్ లాంటి బలమైన ప్రాంతీయ నాయకులను ప్రజలు ఆశీర్వదించి, అండగా నిలిస్తే దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి బాటలు పడుతాయని చెప్పారు.

కాంగ్రెస్ చేతగాని తనమే బీజేపీ బలం

మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటమితో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ మరింత బలహీన పడిందని కేటీఆర్ చెప్పారు. గతంలో హర్యానాలో, ఇప్పుడు మహారాష్ట్రలో గెలుస్తుందని భావించినా ఆ రెండు రాష్ట్రాల ప్రజల మనసులను కాంగ్రెస్ గెలుచుకోలేకపోయిందన్నారు. తెలంగాణ, కర్ణాటకలో మోసాలను దేశ ప్రజలు గమనిస్తున్నారని ఉదహరించారు. ఈ ఎన్నికల ఫలితాలతో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఏమాత్రం మంచి అభిప్రాయం లేదని తేలిపోయిందన్నారు. కాంగ్రెస్ చేతగాని, అసమర్థ విధానాలే బీజేపీ బలమని, ముందుగా తనను తాను సంస్కరించుకోని కాంగ్రెస్.. ప్రాంతీయ పార్టీల అంతానికి కుట్ర చేస్తున్నదని, ఈ కుట్రలో కాంగ్రెస్ ఎక్కువ.. బీజేపీ తక్కువేం కాదని విమర్శించారు.

ప్రాంతీయ పార్టీలదే హవా

మెదక్ మాజీ ఎమ్మెల్యే పటోళ్ల

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : దేశంలో ప్రాంతీయ పార్టీల హవా కొనసాగనున్నదని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలే ఇందుకు ఉదాహరణ అని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మహారాష్ట్రలో రెండు శివసేనలు, ఎన్సీపీ, జార్ఖండ్‌లో జేఎంఎంలకు వచ్చిన ఓటింగ్ శాతాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతున్నని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్‌ఎస్ వందసీట్లు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు.

మహారాష్ట్రలో పనిచేయని రేవంత్ ప్రచారం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రచారం పనిచేయలేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ నుంచి సొమ్ములు పంపినా కాంగ్రెస్‌కు ఫలితం దక్కలేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధించడంపై హర్షం వ్యక్తంచేశారు. దేశ ఆర్థిక రాజధాని మహారాష్ట్రలో కాంగ్రెస్ అనేక తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు మోదీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌కే పట్టం కట్టారని తెలిపారు. బీజేపీ వస్తే రిజర్వేషన్లు పోతాయని, మరాఠాలకు అన్యాయం జరుగుతుందని ప్రచారం చేశారని, 5 నెలల్లోనే ప్రజలకు వాస్తవం అర్థమైందని చెప్పారు. మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు విపక్ష హోదా కూడా దక్కలేదని తెలిపారు. కాంగ్రెస్ మూడు రాష్ట్రాలకే పరిమితం అయ్యిందని ఎద్దేవా చేశారు. గ్యారెంటీల పేరుతో మభ్యపెట్టిన తెలంగాణ, కర్ణాటక, అదే పేరుతో మునిగిపోయిన హిమాచల్‌ప్రదేశ్‌లో మాత్రమే కాంగ్రెస్ ఉన్నదని చెప్పారు.

కాంగ్రెస్, బీజేపీలకు గట్టి గుణపాఠం

- రెండు పార్టీలకు బుద్ధిచెప్పిన మహారాష్ట్ర, జార్ఖండ్
- కాంగ్రెస్ గ్యారెంటీల గారడీని మహారాష్ట్ర ప్రజలు నమ్మలే
- బీజేపీ కక్ష సాధింపును ప్రజలు హర్షిస్తలేరని జార్ఖండ్ ఫలితాలతో తేలింది
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మోసాలు, బీజేపీ కక్షసాధింపు చర్యలకు మహారాష్ట్ర, జార్ఖండ్ ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. ఆ రెండు రాష్ట్రాల ప్రజలు రెండు జాతీయ పార్టీలకు బుద్ధిచెప్పారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్రలో 5 గ్యారెంటీల పేరిట చేసిన గారడీని ప్రజలు నమ్మలేదని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది నుంచి చేస్తున్న మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు రూ.2,500 ఇస్తామన్న మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయకుండా మహారాష్ట్రలో రూ.3,000 ఇస్తామనడం, రైతు భరోసా ఎగ్గొట్టడం, ఆసరా దోఖా, రైతు రుణమాఫీ పూర్తి చేయకపోవడం వంటి అనేక అంశాలు మహారాష్ట్ర ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపాయని తెలిపారు. తెలంగాణ ప్రజలు మహారాష్ట్రలోని ముంబయి, షోలాపూర్, పూణె, నాందేడ్ వంటి ప్రాంతాల్లో అత్యధికంగా నివసిస్తుండడం వల్ల కాంగ్రెస్ మోసాలపై విరివిగా ప్రచారమై అక్కడి ప్రజలు కాంగ్రెస్‌ను పాతాళానికి తొక్కారని వివరించారు. జార్ఖండ్‌లో మాజీ సీఎం హేమంత్ సోరెన్‌పై బీజేపీ పెట్టిన అక్రమ కేసులు, అరెస్టులు, పార్టీని చీల్చే ప్రయత్నాలను ఆ రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని, బీజేపీ కక్ష సాధింపు విధానాలను ప్రజలు హర్షించడం లేదని జార్ఖండ్ ఫలితాలతో స్పష్టమైందని చెప్పారు. జార్ఖండ్‌లో విజయం సాధించిన హేమంత్ సోరెన్‌కు హరీశ్ శుభాకాంక్షలు తెలిపారు.

రేవంత్ ఫెయిల్.. భట్టే బెటర్!

జార్ఖండ్‌లో ఫలించిన విక్రమార్క వ్యూహాలు

పొత్తులు, సీట్ల సర్దుబాటులో కీలక భూమిక • బెడిసికొట్టిన సీఎం రేవంత్ ప్రచార సభలు

హైదరాబాద్, నవంబర్23(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి కంటే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బెటర్ అని రాజకీయ విశ్లేషకులతోపాటు కాంగ్రెస్ క్యాడర్ కూడా భావిస్తున్నది. మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఇది నిరూపణ అయిందని వారు భావిస్తున్నారు. మహారాష్ట్రలోని మరత్వాడ, విదర్భ ప్రాంతాలకు సీఎం రేవంత్‌రెడ్డిని స్టార్ క్యాంపెయినర్‌గా విఫలమవగా, జార్ఖండ్‌లో ఏఐసీసీ అబ్జర్వర్‌గా భట్టి విక్రమార్క సక్సెస్‌ను అందుకున్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. వేదికలపైన అట్టహాసం, ఊకదంపుడు ఉపన్యాసాలతో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కూటమిని భ్రష్టు పట్టించారని, భట్టి విక్రమార్క మాత్రం క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలను ఎప్పటికప్పుడు అధిష్ఠానంతో సమన్వయం చేసుకుంటూ జేఎంఎం కూటమిని విజయ తీరాలకు చేర్చడంలో కీలక భూమిక పోషించారని అంటున్నారు.

మహా వికాస్ అగాడీ తరఫున ఎన్నికల ప్రచార బరిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హెలికాప్టర్‌ను వినియోగించుకుంటూ మహారాష్ట్రలో చక్కర్లు కొట్టారు. తెలంగాణ ఓటర్లు పెద్ద సంఖ్యలో స్థిరపడిన జిల్లాల్లోనే ఆయన పర్యటించారు. రోడ్ షోలు, బహిరంగసభలు నిర్వహించారు. మహా వికాస్ అగాడీ అభ్యర్థులతో కలిసి ముమ్మర ప్రచారం సాగించారు. కానీ మహారాష్ట్రలో ఆ కూటమికి రేవంత్‌రెడ్డి ఓటమిని మూటగట్టించారని అసంతృప్తి రగులుతున్నది.

భట్టి ప్లాన్ సక్సెస్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ సీనియర్ అబ్జర్వర్‌గా కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ప్రభుత్వ ఏర్పాటుకు మ్యాజిక్ ఫిగర్ 44 సీట్లు కావాల్సి ఉన్నది. కాంగ్రెస్, జేఎంఎం కూటమి 55 స్థానాలు గెలుచుకున్నది. ఈ విజయం వెనుక భట్టి విక్రమార్క వ్యూహాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అట్టహాసాల కంటే క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను అంచనా వేయడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని, క్షేత్రస్థాయి సమస్యలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతి వ్యూహాలు, ఎత్తులు, పైఎత్తులు ఇతర అంశాలను ఎప్పటికప్పుడు బేరీజు వేస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో సమన్వయం చేసుకుంటూ.. కిందిస్థాయిలో అమలు పరిచారని వారు చెప్తున్నారు. అభ్యర్థుల ఎంపిక, జేఎంఎంతో పొత్తులు, సీట్ల సర్దుబాటు, ఇతర అంశాలపై పార్టీ సీనియర్ నేతలతో చర్చించి అధిష్ఠానాన్ని ఒప్పించడంలో భట్టి సక్సెస్ అయ్యారని అభిప్రాయపడ్డారు. పోలింగ్ శాతాన్ని పెంచడంపై భట్టి ప్రత్యేక ప్లాన్ కాంగ్రెస్, జేఎంఎం కూటమి గెలుపునకు దోహదపడిందని చెప్తున్నారు.

రేవంత్ ప్రచారం.. కాంగ్రెస్ ఓటమి

- 13చోట్ల ప్రచారం.. ఒక్కటే గెలుపు
- మాణిక్‌రావ్ ఠాక్రే సైతం ఓటమి
- పనిచేయని ముఖ్యమంత్రి రేవంత్ అబద్ధపు ప్రచారం
- మాయమాటల్ని నమ్మని ప్రజలు

హైదరాబాద్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు మహారాష్ట్ర ఎన్నికల్లో పని చేయలేదు. రేవంత్‌రెడ్డి ప్రత్యక్షంగా 13 అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రచారం చేస్తే.. ఒక్క సీటులోనే కాంగ్రెస్ గెలిచింది. పరోక్షంగా మరో 10 సీట్లలో ప్రచారం చేశారు. అక్కడా పార్టీ అభ్యర్థులకు ఓటమి తప్పలేదు. రాజురా, దిగ్రాస్, వార్ధా, నయాగాన్, బోకర్, నాందేడ్ నార్త్, నాందేడ్ సౌత్, సోలాపూర్ సిటీ సెంటర్, సిటీ నార్త్, సిటీ సౌత్, నాగ్‌పూర్, పుణె, పాలూస్ కడెంగాన్, చంద్రాపూర్ నియోజకవర్గాల్లో రేవంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. వీటిలో ఒక్క పాలూస్ కడెంగాన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విశ్వజిత్ గెలుపొందారు. గతంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా వ్యవహరించిన మాణిక్‌రావ్ ఠాక్రే దిగ్రాస్ నియోజకవర్గం నుంచి పోటీచేశారు. ఆయన కోసం రేవంత్ ప్రచారం చేసినా ఓటమిని ఆపలేకపోయారు.

రేవంత్‌ను నమ్మని మరాఠా జనం

మహారాష్ట్ర ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి స్టార్ క్యాంపెయినర్‌గా కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. మూడుసార్లు మహారాష్ట్ర వెళ్లి వారంరోజులు అక్కడే మకాం వేశారు. ముంబై, పుణె, సోలాపూర్‌లో మీడియా సమావేశాలు, రోడ్ షోలు నిర్వహించారు. పలుచోట్ల భారీ బహిరంగసభల్లో పాల్గొన్నారు. అన్నిచోట్ల తెలంగాణలో కాంగ్రెస్ పాలన గొప్పతనం ఇది అంటూ మరాఠా ప్రజలకు చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీల అమలు తీరుపై గొప్పగా చెప్పారు. కాంగ్రెస్ కూటమిని గెలిపిస్తే మహారాష్ట్ర అభివృద్ధి బాధ్యత తనదేనంటూ భరోసా ఇచ్చారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తామని, రూ.3 లక్షల రుణమాఫీ చేస్తామంటూ హామీలను గుప్పించారు. ఇవన్నీ చెప్పినా మహారాష్ట్ర ప్రజలు రేవంత్ మాటలను విశ్వసించలేదు. ఆయన గారడి బుట్టలో పడలేదు. తెలంగాణలో ఇచ్చిన హామీలు ఏ విధంగా అమలవుతున్నాయో తెలుసుకున్న మహారాష్ట్ర ప్రజలు రేవంత్ రెడ్డి చెప్పిన అబద్ధాలను నమ్మలేదు.

సరిహద్దుల్లో సీన్ రివర్స్!

- మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తెలంగాణ దెబ్బ
- రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఆరు గ్యారెంటీలు తుస్!
- నీటిమూటలైన సీఎం మాటలు

హైదరాబాద్/నిజామాబాద్/మంచిర్యాల, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధులు): మహారాష్ట్రలో 'చేతి' పార్టీ తేలిపోయింది. తెలంగాణ కాంగ్రెస్ నేతల మాటలకు విలువలేకుండా పోయింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌కు ఘోర ఓటమిలో తెలంగాణ కాంగ్రెస్ నేతల పాత్ర తోడైంది. తెలంగాణలో కాంగ్రెస్ పాలకులు హామీల అమలులో మొండి'చేయి' చూపించడంతో.. మహారాష్ట్ర ప్రజలు కూడా హస్తం పార్టీకి రిక్తహస్తం చూపించారు. తెలంగాణకు పశ్చిమ దిక్కున మహారాష్ట్రలో ఉన్న నాందేడ్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ హస్తం పార్టీ ఖాతా తెరవనేలేదు. ఈ లోక్‌సభ పరిధిలోని నాయ్‌గావ్, దెగ్లూర్, ముద్‌ఖేడ్, భోకర్‌లో తెలంగాణ వాసులు ఎక్కువగా జీవనం సాగిస్తున్నారు. నాందేడ్ నగరంలోనే సుమారు 40 వేల మంది వరకు తెలుగు మాట్లాడే వారున్నారు. ఇక్కడ రాహుల్‌గాంధీతోపాటు తెలంగాణ మంత్రులు, ఎంపీలు ప్రచారం చేశారు. నాందేడ్ లోక్‌సభకు జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణలో రేవంత్ సర్కారు వైఫల్యం మూలంగా ఆరు అసెంబ్లీ సీట్లను కాంగ్రెస్ పార్టీ కోల్పోయింది.

అబద్ధాలను పసిగట్టిన మరాఠీలు

తెలంగాణలో కాంగ్రెస్ అబద్ధపు హామీలను పొరుగునే ఉన్న మరాఠీలు పసిగట్టారు. కేసీఆర్ హయాంలో ఉన్న పలు పథకాలు నేడు లేవనే విషయాన్ని వారు గుర్తించారు. ఆదిలాబాద్ సమీపంలోని అర్నీ, కిన్వట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయారు. నిర్మల్ జిల్లా పక్కనున్న బోకర్, నయాగాం నియోజకవర్గాల్లో సైతం కాంగ్రెస్‌కు ఓటమి తప్పలేదు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలతో కలిసి సరిహద్దు పంచుకుంటున్న అహేరి నియోజకవర్గంలో కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితమైంది. ఆసిఫాబాద్ పక్కనున్న చంద్రాపూర్ నియోజకవర్గంలోనూ హస్తం పార్టీకి ఓటమి తప్పలేదు. ఆయా నియోజకవర్గాల్లో సీఎం రేవంత్ సహా మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రచారం అక్కడి హస్తం పార్టీ అభ్యర్థుల కొంపముంచింది.

కాంగ్రెస్‌కు ఓటేయొద్దు

సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ మంత్రుల మాటలు నమ్మి ఓటేయొద్దు.. అని మహారాష్ట్ర ఓటర్లకు బంధువులు, మిత్రులైన తెలుగు ప్రజల సూచన ఫలించింది. తెలంగాణలో 11 నెలల కాలంలోనే ఆరు గ్యారెంటీలు, హామీలను అమలు చేయకుండా మాయ మాటలతో మోసం చేయజూసిన విషయాన్ని తేల్చిచెప్పడంతో మహారాష్ట్ర ప్రజలు జాగ్రత్తపడ్డారు. దీంతో సరిహద్దు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ చతికిలపడింది. రేవంత్ మాటల మీద అనుమానం వచ్చిన మహారాష్ట్ర తెలుగు ప్రజలు బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేసి తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఎలా ఉన్నదో ఆరా తీశారు.

కాంగ్రెస్‌ను రైతులు నమ్మలేదు

కాంగ్రెస్‌ను మా రాష్ట్ర రైతులు నమ్మలేదు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇస్తానని చెప్పిన పథకాలను అమలు చేయలేదు. దీంతో కిన్వట్ నియోజకవర్గ రైతులు కాంగ్రెస్‌ను పక్కనబెట్టారు. తెలంగాణలో కేసీఆర్ ఉన్నప్పుడు రైతుల కోసం అమలు చేసిన పథకాలు ఇప్పుడు లేవని అక్కడ ఉన్న మా బంధువులు చెప్పడంతో అందరం కాంగ్రెస్‌ను దూరం పెట్టినం.

- పెందూర్ లచ్చు, రైతు, హీరాపూర్, కిన్వట్ నియోజకవర్గం

కాంగ్రెస్ పథకాలపై నమ్మకం పోయింది



మహారాష్ట్ర ఎన్నికల్లో మరట్వాడ, విదర్భతోపాటు ఇతర ప్రాంతాల్లో ప్రజలు కాంగ్రెస్ నాయకుల హామీలను నమ్మలేదు. కాంగ్రెస్ పాలిత తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పథకాలను మహారాష్ట్రలో సైతం అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సభల్లో ప్రకటించారు. వారి పథకాలపై నమ్మకం లేకపోవడంతో కాంగ్రెస్‌ను మరాఠా ప్రజలు నమ్మలేదు.

- నితిన్ యాదవ్, సర్పంచ్, సగ్గా, అర్ని నియోజకవర్గం

మహారాష్ట్రను ముంచిన తెలంగాణ గ్యారెంటీలు

- ఇక్కడి పాలనా వైఫల్యాలపై అక్కడి ప్రజల్లో చర్చ
- సీఎం, మంత్రులు మోహరించినా ఫలితం శూన్యం
- లాభం కంటే నష్టమే ఎక్కువైందని అభిప్రాయాలు
- తెలంగాణ ఆరు గ్యారెంటీలపై మంత్రుల విస్తృత ప్రచారం
- అయినా నమ్మని జనం.. కాంగ్రెస్‌కు తప్పని ఓటమి

హైదరాబాద్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై తెలంగాణ ప్రభావం ఉన్నదా? ఇక్కడి కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను చూసిన మహా ప్రజలు.. అసలు కాంగ్రెస్‌నే తిరస్కరించారా? గ్యారెంటీలు, వారెంటీల గారడీని జనం నమ్మలేదా? అందుకు సీఎంతోపాటు మంత్రివర్గం మొత్తాన్ని అక్కడ మోహరించినా ఫలితం రాలేదా? ఈ ప్రశ్నలకు రాజకీయ విశ్లేషకుల్లో అవుననే సమాధానాలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్ర ఎన్నికలపై, కాంగ్రెస్ ఓటమిపై తెలంగాణ ప్రభావం కచ్చితంగా ఉన్నదని చెబుతున్నారు. మహారాష్ట్రలో మెజార్టీ నియోజకవర్గాలు తెలుగువారి ప్రభావం ఉన్నవే. తెలంగాణతో సరిహద్దులను పంచుకోవడంతోపాటు కుటుంబ బంధుత్వాలు, వ్యాపార సంబంధాలు కలిగిన నియోజకవర్గాలు ఎన్నో ఉన్నాయి. అందుకే ఏడాదిలో ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలు.. అక్కడ ప్రభావం చూపాయని విశ్లేషకులు తేల్చి చెప్పారు.

గ్యారెంటీల గారడీని నమ్మని మరాఠా ప్రజలు

మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై జోరుగా చర్చ జరిగింది. కాంగ్రెస్ జాతీయ నేతలు తెలంగాణ ఆరు గ్యారెంటీలపై ప్రజలకు ఏకరువు పెట్టారు. తెలంగాణ సీఎం, మంత్రుల ప్రచారాల్లో వీటిపైనే దంచికొట్టారు. తెలంగాణలో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకొచ్చారు. ఎగ్గొట్టిన హామీలపై మాట్లాడకుండా అరకొరగా అమలుచేసిన హామీలనే చెప్పుకోసాగారు. రుణమాఫీ పూర్తి చేశామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, ఉచిత విద్యుత్తు అమలు చేస్తున్నామని ఇలా పలు రకాల గ్యారెంటీలపై ప్రచార సభల్లో వివరించారు. ఈ గ్యారెంటీల గారడీని మహారాష్ట్ర ప్రజలు నమ్మనేలేదు. తెలంగాణ సరిహద్దులు, బంధుత్వాలు, తెలుగు ప్రజలు సెటిలైన ప్రాంతాల్లో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు సక్రమంగా అమలు కాని విషయం తెలిసిపోయింది. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలపై కోతలు పెట్టిన విషయమూ తెలిసింది. అరకొరగా గ్యారెంటీల అమలు, పాత పథకాల రద్దు అంశాలూ తెలుసుకున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో పూర్తిగా విఫలమైందనే చర్చ ప్రజల్లో జోరుగా జరిగింది. ఈ కారణాలతో అక్కడి ప్రజలు ఆరు గ్యారెంటీలను, తెలంగాణ నేతల మాయమాటలను పట్టించుకోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తేలిపోయిన తెలంగాణ మంత్రులు

మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులంతా అట్టర్ ఫ్లాప్ అయ్యారనే విశ్లేషకులు అంచనాకు వచ్చారు. ఈ ఎన్నికల్లో ప్రచారం కోసం తెలంగాణ మంత్రివర్గం మొత్తం మహారాష్ట్రలో మకాం వేసింది. సీఎం రేవంత్‌రెడ్డిని స్టార్ క్యాంపెయినర్‌గా నియమించగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మరట్వాడ రీజియన్‌కు సీనియర్ అబ్జర్వర్‌గా నియమించింది. మరో మంత్రి సీతక్కను సీనియర్ అబ్జర్వర్‌గానూ నియమించింది. వీరితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇలా మంత్రులంతా మహారాష్ట్రలో ప్రచారం చేశారు. రోజుల తరబడి అక్కడే ఉంటూ ప్రచారంలో పాల్గొన్నారు. తెలంగాణ పథకాలు, అరు గ్యారెంటీలపై విస్తృత ప్రచారం చేశారు. అయితే వీరి ప్రచారం ఫలించలేదు. అసలు తెలంగాణ సీఎంతోపాటు మంత్రుల ప్రచారం కాంగ్రెస్ కూటమికి లాభం కంటే నష్టమే ఎక్కువ చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో పాలనలో విఫలమైన నేతలు మహారాష్ట్రకు ఏం చెప్తారని అక్కడి ప్రజలు విశ్వసించలేదు. ముఖ్యంగా వీళ్లను చూసే మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు దూరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చినట్టు విశ్లేషకులు చెప్తున్నారు.

పవన్‌కల్యాణ్ వల్లే గెలిచా!

మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే రాజేశ్ కోతే

ముంబై నవంబర్ 23(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వల్లే గెలిచానని మహారాష్ట్రలోని సోలాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తెలుగు యువకుడు దేవేంద్ర రాజేశ్ కోతే తెలిపారు. సోలాపూర్‌లో పవన్ ర్యాలీ, రెండు గంటల రోడ్ షోకు భారీగా తరలివచ్చిన ఓటర్లు తనకు మద్దతుగా నిలిచారని చెప్పారు. దీంతో దేవేంద్ర రాజేశ్ కోతే వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. వాటిని పవన్ ఫ్యాన్స్, జనసైనికులు తెగ వైరల్ చేస్తున్నారు.

తెలంగాణలో భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే

బెవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో భవిష్యత్ బీఆర్‌ఎస్‌దేనని బెవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్ అన్నారు. ప్రాంతీయ పార్టీల సహకారం లేకుండా ప్రభుత్వాలను ఏర్పాటు చేయలేరనే విషయం మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలతో రుజువైందని తెలిపారు. రెండు రాష్ట్రాల ఫలితాలు బీజేపీ, కాంగ్రెస్‌పై పెరుగుతున్న ప్రజావ్యతిరేకతకు అద్దం పట్టాయని అన్నారు. దేశంలో ప్రాంతీయ పార్టీలకు ఉజ్వల భవిష్యత్ ఉందని పేర్కొన్నారు.

పరామర్శించేందుకూ భయం

- కొండారెడ్డిపల్లిలో భారీగా పోలీసులు
- సాయిరెడ్డి ఆత్మహత్యతో తీవ్ర విషాదం
- అధికారానికి భయపడుతున్న రైతులు
- కడసారి చూపునకు నోచుకోని దైన్యం

నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో పోలీసుల పహారా

మహబూబ్‌నగర్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో శోకాన్ని కూడా గొంతు దాటి బయటకు వ్యక్తం చేయలేని తీవ్ర విషాదం నెలకొంది. పోలీసు పహారా మధ్య ఆవరించిన నిశ్శబ్దంలో క్షణక్షణం.. భయం భయంగా గడుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామంలో ఎవరు ఏం మాట్లాడితే.. ఎవరికి ఏం జరుగుతుందో.. అనే భయం స్థానికుల్లో నెలకొన్నది. 13 ఏండ్లు గ్రామ సర్పంచ్‌గా సేవలందించినా అధికార బలాన్ని ఎదిరించడానికి బలం సరిపోక, అవమానాలు, అరాచాకాలను తట్టుకోలేక పాంకుంట్ల సాయిరెడ్డి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆ కుటుంబాన్ని ఓదార్చేందుకు, సాయిరెడ్డిని కడసారి చూసేందుకు కూడా జనం భయపడుతున్నారు.

కల్వకుర్తి దవాఖానలో భౌతికకాయం

సీఎం రేవంత్‌రెడ్డి సోదరుల ఆగడాలతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్‌నోట్ రాసిన సాయిరెడ్డి భౌతికకాయం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలోనే ఉన్నది. సాయిరెడ్డి పెద్ద కొడుకు వెంకట్‌రెడ్డి అమెరికాలోని తన బిడ్డల దగ్గరకు వెళ్లడంతో ఆయన రాకకోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఆదివారం రాత్రి వెంకట్‌రెడ్డి హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం ఉందని తెలుస్తున్నది. సాయిరెడ్డిని భౌతికకాయాన్ని చూసేందుకు అతడి సంతానం, బంధువులు తప్ప.. సానుభూతి తెలిపేందుకు గ్రామస్థులు పెద్దగా ఎవరూ ముందుకు రావడంలేదు. వాట్సాప్ గ్రూపుల్లో కూడా ఎలాంటి ముచ్చట కనిపించడం లేదు. సాయిరెడ్డి ఆత్మహత్య వార్త శుక్రవారం సాయంత్రం 6 గంటలకే అందరికీ తెలిసినా.. గ్రామస్థులు చాలా మందికి రాత్రి వరకు తెలియలేదు. కల్వకుర్తికి భారీ సంఖ్యలో పోలీసులు చేరుకుని ఎవరేమి మాట్లాడుతున్నారో నిఘా ఉంచారు. పోలీసు ఉన్నతాధికారుల నేతృత్వంలో భారీగా బలగాలు మోహరించాయి.

సాయిరెడ్డి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి: జైపాల్

కల్వకుర్తి, నవంబర్ 23 : కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉన్న సాయిరెడ్డి భౌతికకాయంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ సాయిరెడ్డిని వేధింపులకు గురిచేయడం.. ప్రాణాలు తీసుకునే వరకు ఇబ్బందుల పాలు చేయడం సరి కాదని అన్నారు. ఆత్మక్షోభకు గురైన ఆయన అవమానాన్ని తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. సాయిరెడ్డి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో రేవంత్ అరాచక పాలన

సాయిరెడ్డి మృతి కేసును సుమోటోగా తీసుకోవాలి: డీకే అరుణ

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, నవంబర్ 23 : రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన సాగుతున్నదని.. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ ఆత్మహత్యనే ప్రత్యక్ష నిదర్శనమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. సీఎం స్వగ్రామంలో రేవంత్‌రెడ్డి సోదరుల వేధింపులతోనే మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ ఘటనపై రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆయన మరణ వాంగ్మూలాన్నే సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.